క్లుప్తంగా

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు

మల్దకల్: ఫర్టిలైజర్ షాపు యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ ఫర్టిలైజర్ నిర్వాహకులను హెచ్చరించారు. స్థానిక ఫర్టిలైజర్ షాపులను ఆయన సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు, రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా షాపు యజమానులతో రశీదులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జెడ్పీచైర్‌పర్సన్ పరామర్శ

గద్వాల రూరల్: మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన డీలర్ సాయిబాబ తండ్రి బోయ రంగన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత సోమవారం అనంతపురం గ్రామానికి వెళ్లి బాధితకుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆలయంలో స్వాముల పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కార్తీక మాసంతో శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శివ స్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన



పెబ్బేరు రూరల్: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో పాఠాలు అర్థమయ్యేలా బోధన ఉండాలని మండల ఎంఈఓ జయరాములు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలు సులువుగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాల బోధన జరగాలన్నారు. ఉపాధ్యాయులు మాడల్ లెసన్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్ఎం సత్యనారాయణ, నారాయణ, మోహన్‌రాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల పెంపుపై శిక్షణ

వీపనగండ్ల: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపుపై కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు సోమవారం మండల కేంద్రంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గణితం, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో అవసరమైన పరిజ్ఞానాన్ని కలిగి ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించగలుగుతామని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, పుల్గర్‌చర్ల, రంగవరం, కల్వరాల గ్రామాల ప్రాథమిక పాఠశాలలు, అప్పర్ ప్రైమరీ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

పూడుకపోతున్న చెరువు కాల్వ



అమరచింత: 15ఏళ్ల కిందట అమరచింత పెద్ద చెరువును లిఫ్టు నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరును అందించాలనే సంకల్పంతో నిర్మించిన చెరువు కాల్వ నేడు పూడుకుపోతున్నా సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదు. అమరచింత లిఫ్ట్ నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ విఠల్‌రావు, ఎమ్మెల్యే స్వర్ణమ్మ నిధుల ద్వారా కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహారం పథకం ద్వారా మరోమారు నిధులు మంజూరు కావడంతో పూర్తి స్థాయిలో కాల్వను నిర్మించారు అమరచింత రైతులు, అఖిలపక్ష నాయకులు. కానీ 15 ఏళ్లుగా లిఫ్టు నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలకపోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వీటి నిర్వహణ మరిచిపోయారు. దీంతో కాల్వలో భారీ చెట్లతో పాటు ముళ్లపొదలు పెరిగి కాల్వను కమ్ముకున్నాయి. సాగునీటి కోసం ఖర్చుపెట్టిన సుమారు రూ.20 లక్షలు మట్టిలో కలిసిపోయాయని రైతన్నలు వాపోతున్నారు.

పశుగ్రాసం కొరత

- సాగుచేస్తున్న వాణిజ్య పంటలు
- ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ. 16,000

అయిజ: అలంపూర్ నియోజకవర్గంల ఏడాదికేడాది సాంప్రదాయ పంటల సాగును తగ్గించి వాణిజ్య పంటలు ఎక్కుగా సాగుచేయడం వలన తీవ్రమైన పశుగ్రాసం కొరత ఏర్పడింది. సాగునీటి వనరులున్న ప్రదేశాల్లో వానకాలంలో పండించిన వరిపంట ద్వారా లభించిన వరిగడ్డి మాత్రమే పశువుల మేతకు ఆధారమైంది. అదికూడా సరిపడినంతగా లేకపోవడంతో కృష్ణానది పరివాహక ప్రదేశాల్లో సాగుచేసిన వరి పశుగ్రాసంపై అలంపూర్ నియోజకర్గం రైతులు ఆధారపడాల్సి వచ్చింది. పశువులకు సరిపడినంత పశుగ్రాసం దొరకకపోవడంతో అన్నదాతలు అధిక డబ్బు వెచ్చించి కష్టానది తీరప్రాంతాల్లో పండించిన వరిగడ్డిని అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

తగ్గిన ఆహారధాన్యాల సాగు..

ఆహార ధాన్యాల సాగు ఏడాదికేడాదికి అలంపూర్ నియోజకవర్గంలో తగ్గుతోంది. దీంతో మూగజీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. అలంపూర్ నియోజకవర్గంలో సజ్జలు, మొక్కజొన్న, కొర్ర, కంది పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. ప్రత్యామ్నాయంగా మిరుప, పత్తి పంటలు ఎక్కువగా సాగుచేశారు. దానివల్ల పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడింది.



ట్రాక్టర్‌తో వరిగడ్డిని తరలిస్తున్న రైతులు

పెరిగిన వరిగడ్డి ధర

ఆర్డీఎస్ ఆయకట్టుతో పాటు, నది పరివాహక ప్రాంతాల్లో, బోరుబావులున్న ప్రదేశాల్లో ఆహార ధాన్యాల పంటలు ఎక్కువగా సాగు చేయకపోవడంతో ఒక ఎకరంలో పండిన వరిగడ్డి ధర రూ.5వేలకు చేరింది. ఒక ట్రాక్టర్ వరిగడ్డి కావాలంటే మూడు ఎకరాల్లో సాగుచేసిన వరిగడ్డి సేకరించాలి. దాని కోసం రూ. 15వేలు ఖర్చుపెట్టాలి. దాన్ని ఇతర గ్రామాలకు తరలించాలంటే ట్రాక్టర్ కిరాయి, రూ.2వేలు, కూలీల ఖర్చు రూ. 2వేలు అవుతుంది. దాంతో మొత్తం ట్రాక్టర్ వరిగడ్డి ఖర్చు రూ.19వేలు అవుతుంది.

నియోజకవర్గంలో పశువుల సంఖ్య..

మండలం	గొర్రెలు	గేదెలు	ఆవులు, ఎద్దులు
అయిజ	65348	8921	6431
ఇటిక్యాల	82132	4662	5623
మానవపాడు	35120	4506	2706
అలంపూర్	52425	3240	2987
ఉండవెల్లి	43322	4286	2732
వడ్డెపల్లి	51289	3998	3826
రాజోలి	42311	5126	3824

మూగజీవాలకు మేత కరవైంది



రైతులు వాణిజ్య పంటలు సాగుచేయడంతో మూగజీవాలకు మేత కరువైంది. వేరు శనగ, కంది, జొన్న పంటలు పండితేనే పశువులకు మేత పుష్కలంగా లభిస్తుంది. సాంప్రదాయ పంటల సాగు తగ్గిపోవడంతో పశువులకు మేతలేకుండా పోయింది. పశుగ్రాసం లభించకపోవడంతో వరిగడ్డిని ఎక్కువ ధరలకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– గోవిందు, అయిజ

వరిగడ్డి మాత్రమే దొరుకుతుంది..



రైతులు పైసలు పెట్టి మేతను కొనాలనుకున్నాసరే వరి తప్ప ఇతర ఆహార ధాన్యాల పశుగ్రాసం దొరకదు. నదీతీర ప్రాంతాల్లో పండించిన వరి పశుగ్రాసం మాత్రమే పశువులకు మేతగా దొరుకుతోంది. దాన్ని కొనేందుకు అందరు రైతులు ఎగబడడంతో వరిగడ్డిధర అమాంతం పెరిగింది. మేత కొనలేక రైతులు పశువులను అమ్ముకునే దుస్థితి ఏర్పడింది.

– సత్యారెడ్డి, అయిజ

పచ్చిగడ్డిని సాగుచేయాలి..



రైతులు పశుగ్రాసానికి సంబంధించిన పంటలు సాగు చేయకపోవడంతో మండలంలో పశుగ్రాసం కొరత ఎక్కువైంది. దాని వల్ల రైతులు పొరుగు మండలాల్లో అధిక ధరలకు వరిగడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తుంది. బోరుబావులున్న ప్రదేశాల్లో రైతులు పచ్చి గడ్డికి సంబంధించిన విత్తనాలు చల్లి పశుగ్రాసాన్ని పెంచాలి. దానివల్ల కొంతమేర పశుగ్రాసం కొరతను తగ్గించుకోవచ్చు.

– స్వరూపారాణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ



వృద్ధులకు ధన్యవాదాలు తెలుపుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

గద్వాల రూరల్: గద్వాల ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపొందిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. గట్టు మండలం సోంపురం గ్రామానికి చెందిన వృద్ధదంపతులు దూరప్రాంతం నుంచి ఎమ్మెల్యే బండ్లకు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రత్యేకంగా రావడంతో విషయం తెలుసుకున్న బండ్ల వారిని అప్యాయంగా దగ్గరకు తీసుకుని ధన్యవాదాలు తెలిపారు.

గట్టు: గద్వాల ఎమ్మెల్యేగా రెండోసారి విజయం సాధించిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని సోమవారం గట్టు మండల బీఆర్ఎస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ చైర్మన్ రాయాపురం రాముడు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు కొళాయి భాస్కర్, హనుమంతురెడ్డి, రాజప్ప, తిమ్మప్ప, వీరభద్రప్ప, వీరారెడ్డి, నాగయ్య, ప్రాణేష్, నరేష్, మాచర్ల అలీ, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. వారితో పాటుగా ఆయా గ్రామాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యేను కలిసి అభినందించారు.

తాగునీటికి తప్పని తిప్పలు



ఉండవెల్లిలో ఆటోలో బోరుబావుల వద్ద బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు



వెంకటాపురంలో తాగునీటి కోసం పంటపొలాల వద్దకు వెళ్తున్న యువకులు

అయిజ: మిషన్ భగీరథ పైప్‌లైన్ జూరాలవద్ద లీకేజీ కావడంతో ఆది, సోమవారాల్లో మున్సిపాలిటీలో, మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలో వివిధ కాలనీల్లో, మండలంలోని అన్ని గ్రామాల్లో గతంలో చేతిపంపులు ఉండేవి. మిషన్ భగీరథ పథకం ప్రారంభమయ్యాక చేతిపంపులను పట్టించుకోకపోవడంతో అవి మరమ్మతులకు నోచుకోకుండా పోయాయి. కొన్ని ప్రదేశాల్లో చేతిపంపులు పనిచేసినా ఉప్పునీరు కావడంతో అవి ప్రజల దాహాన్ని తీర్చలేకపోతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో యువకులు మోటార్ సైకిళ్లపై పంటపొలాల వద్దకు వెళ్లి బోర్‌వెల్ మోటర్ల వద్ద తాగునీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులను త్వరగా పూర్తి చేసి తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన నీటి సరఫరా

గట్టు: మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి పోవడంతో గట్టుతో పాటుగా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు ఇబ్బంది పడ్డారు. మండలంలో జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పాటుగా జాతరకు వచ్చిన దుకాణాదారులు తాగు నీటికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఖాళీ బిందెలతో వ్యవసాయ పొలాల్లోని బోర్ల దగ్గరకు పరిగెత్తాల్సి వచ్చింది. ద్విచక్ర వాహనాలపై రోజు వారి అవసరాలకు, తాగునీటిని తెచ్చుకున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శాంతినగర్‌లో మిషన్ భగీరథ నీటి పైప్ దెబ్బ తినడంతో నీరు రావడం లేదని అధికారులు తెలిపారు. సాయంత్రం సమయంలో నీరు ట్యాంకులకు చేరుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆత్మకూర్‌లో మెగా రక్తదాన శిబిరం



ఆత్మకూర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంవీరామన్ పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 64 మంది రక్తదానం చేశారు. ఎంవీ రామన్ విద్యా సంస్థ చైర్మన్, మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. విద్యార్థులు ఆట, పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఖాజాకుత్బుద్దీన్, డాక్టర్ తిరుమలేష్, కలాంపాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

32వ సారి రక్తదానం

ఎంవీరామన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ తెలుగు తిరుమలేష్ 32వ సారి రక్తదానం చేసి ప్రశంసలు అందుకున్నారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ ఖాజాకుత్బుద్దీన్ తదితరులు తిరుమలేష్‌ను శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు.

చిరుజల్లుతో రైతుల ఇక్కట్లు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, గోకులపాడు, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు గ్రామాలలో సోమవారం చిరుజల్లులు కురవడంతో రైతులు చేతికి వచ్చిన మిరప పంటను కలాల్లో వేసి టార్పాలిన్లతో కప్పి ఉంచారు. అకాల వర్షాలతో రైతులు అవస్థలు తప్పడం లేదు.

ఆందోళనలో అన్నదాతలు



ధరూరు: మండలంలో వరిపంట సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలలుగా కష్టించి పండించిన పంట కోత కోసేందుకు కోత మిషన్లు అందుబాటులో లేక నానా అవస్థలు పడుతున్నారు. రెండు మూడు రోజులుగా వాతావరణం మబ్బులతో కనిపిస్తుండడంతో తుఫాన్ ప్రభావంతో అకాల వర్షాలతో ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. రైతులు కోత మిషన్ యజమానుల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. అయినా మిషన్‌లు దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాల కారణంగా చేతికందిన పంటంతా నాశనం అవుతుందని ఆందోళన చెందుతున్నారు. పరిచయాలు, తెలిసిన వారికే కోత మిషన్లు వెళ్తున్నాయని, సామాన్య రైతులను ఎవరూ పట్టించుకోవడం లేదని చింతరేవుల గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జి ఎత్తు పెంచండి



ఉండవెల్లి: మండలంలోని మారమునగాల గ్రామానికి వెళ్లే మార్గంలో లో లెవల్ బ్రిడ్జి ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతంలో లెవల్ బ్రిడ్జితో స్థానికులు వర్షం వస్తే రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నోటుపుస్తకాల అందజేత



పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక, ఎస్సీ కాలనీ ప్రాథమిక, బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ రాఘవరెడ్డి జ్ఞాపకార్థం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం నోటు పుస్తకాలు, పెన్నులు వారి సతీమణి ఇందిరమ్మ అందజేశారు. ఆయా పాఠశాలల్లోని మొత్తం 500 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. పేద విద్యార్థులకు తమ వంతుగా ప్రతిఏటా తోడ్పాటునందిస్తామన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి



బోరవెల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అదనపు డీఆర్‌డీఓ నాగేంద్రం



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

మానవపాడు: ప్రతి గ్రామంలో 50మంది ఉపాధి కూలీలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్‌అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లకు జిల్లా అదనపు డీఆర్‌డీఓ నాగేంద్రం ఆదేశించారు. సోమవారం మండలంలోని జల్లాపురం, బోరవెల్లి, నారాయణపురం, పెద్దఆముదాలపాడు, మానవపాడు గ్రామాలలో నర్సరీలలో సంచులలో మట్టి నింపే కార్యక్రమాన్ని పరిశీలించి, సమావేశంలో మాట్లాడారు. సంచులలో మట్టిని 100శాతం నింపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మట్టి నింపి విత్తనాలను వేయాలని తెలిపారు. జీవామృతం తయారు చేసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలకు సకాలంలో డబ్బు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. అనంతరం నర్సరీల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, ఫీల్డ్‌అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లుపాల్గొన్నారు.

50 మందికి పని కల్పించాలి

శాంతినగర్: ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా గ్రామ పంచాయతీలో ప్రతి రోజు 50 మందికి తక్కువ కాకుండా పని కల్పించాలని ఎంపీడీఓ రవీంద్ర పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వడ్డేపల్లి మండల ఈజీఎస్ అధికారుల సమావేశం ఎంపీడీఓ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనుల్లో భాగంగా అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు గాను బ్యాగుల్లో మట్టి నింపే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మంగళవారం నుంచే పనులు మొదలు పెట్టాలని పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో ఏపీఓ విజయలలిత, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలతో అవస్థలు

ధరూరు: గద్వాల–రాయచూరు ప్రధాన రహదారిలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. మండల కేంద్రం నుంచి గద్వాలకు వెళ్లే దారిలో 10కి.మీ. మేర దాదాపు 10చోట్ల బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడిగా రోడ్ల నిర్వహణ చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ధరూరు ఇండియన్ పెట్రోల్‌బంక్, హెచ్‌పీ పెట్రోల్ బంకు, పారుచర్ల స్టేజీ, గోనుపాడు వెళ్లే దారిలో మూడు చోట్ల, సంగాల స్టేజీ సమీపాల్లో రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. అప్పడప్పుడు ఆ గుంతల్లో మట్టిని పోసి కాలం వెళ్ల దీస్తున్నారు తప్ప మరమ్మతు పనులు చేపట్టడం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు.



ధరూరు పెట్రోలు బంకు వద్ద రోడ్డుపై గుంత

మూల మలుపులతో ప్రమాదాలు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద నిర్మాణ సమయంలో అధికారులు ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్దకల్ నుంచి మద్దెలబండ, అమరవాయి నుంచి బిజ్వారం, పెద్దొడ్డి నుంచి మల్దకల్, కుర్తిరావులచెర్వు నుంచి మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపులు వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



కుర్తిరావులచెర్వు- మల్దకల్ గ్రామాల మధ్య రోడ్డు మలుపు

ప్రమాదకరంగా కల్వర్టులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులపై గతంలో నిర్మించిన కల్వర్టులు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటిక్యాల నుంచి చాగాపురం, ఉదండాపురం నుంచి ఇటిక్యాల, ఎర్రవల్లిచౌరస్తా నుంచి గార్లపాడు వెళ్లే రోడ్లపై పలు కల్వర్టులు వర్షాల కారణంగా కూలిపోయి ఏండ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదు. ఈ దారుల గుండా పదుల సంఖ్యలో గ్రామాలు ఉండటం వల్ల ఆయా రోడ్లు ప్రతి రోజు రద్దీగా ఉండటంతో ఎక్కడో ఒకచోట కల్వర్టులపై ప్రమాదాలకు గురవుతున్నారు. గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి, చాగాపురం, ఇటిక్యాల గ్రామాల సమీపంలో కల్వర్టులు కూలిపోయిన ప్రదేశంలో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కు బిక్కుమంటూ నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలిపోయిన కల్వర్టులకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



సాసనూలు దగ్గర గుంతలు పడి కూలిన కల్వర్టు

ఇళ్లమధ్య నుంచి పందులను తరలించండి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో ఇళ్ల మధ్యన పెంపకందారులు పందులను విచ్చలవిడిగా పెంచడంతో నిత్యం ఇళ్లచుట్టూ స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో మురుగు పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఎర్రవల్లి చౌరస్తాలోని పలు కాలనీల వాసులు వాపోతున్నారు. గ్రామంలో పందుల సమస్యను పరిష్కరించాలని పలుమార్లు స్థానిక అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పందుల వల్ల గ్రామంలో మురుగు పెరిగి నిత్యం కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొన్నారు. దీనివల్ల ఏరోగం ముంచుకొస్తుందోనని నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని గ్రామంలో పెరుగుతున్న పందులను గ్రామానికి దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎర్రవల్లిచౌరస్తాలో ఇండ్లచుట్టూ చేరి స్వైరవిహారం చేస్తున్న పందుల గుంపు

కల్లాల్లోనే వరిధాన్యం

పెబ్బేరు రూరల్: ఉమ్మడి పెబ్బేరు మండలంలో వరికోతలు ప్రారంభమయ్యాయి. కోతలు జోరందుకున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లు మాత్రం ప్రారంభం కాలేదు. కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిసున్నప్పటికీ తూకం వేసి, మిల్లులకు పంపించే ప్రక్రియ ప్రారంభించకపోవడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. దీంతో రైతులు తీవ్రంగా గుబులు చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో అకాల వర్షాలు కురిసి పంటకు నష్టం కలిగే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ధాన్యాన్ని గన్నీ సంచుల్లో నింపి, హమాలీలతో లారీల్లో లోడ్ చేయించి మిల్లులకు పంపే వరకూ గ్యారెంటీ లేని పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మటుకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను గుర్తించడంతోనే సరిపెట్టడంతో ఎప్పటి వరకు ప్రారంభమవుతాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఐకేపీ ద్వారా పెబ్బేరు మండలంలో పెంచికలపాడు, గుమ్మడంతండా, పాతపల్లి, రాంపురం, రంగాపురం, కంచిరావుపల్లి, ఈర్లదిన్నె, తిప్పాయిపల్లిలో సింగిల్ విండో ద్వారా శ్రీరంగాపురం మండలంలోని శ్రీరంగాపురం, వెంకటాపురం, జానంపేట, నాగసానిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను మాత్రమే ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. మిగతా చోట ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేందాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాని కోరారు.



కంచిరావుపల్లిలో ధాన్యం ఆరబెట్టిన రైతులు